

పక్కాగా పౌష్టికాహారం..
అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 8లో



హాజరు శాతం పెంచాలి
పాఠశాలలు ప్రారంభం అయినందున విద్యార్థుల హాజరు శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 27°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వరకూ వేడి వాతావరణమే ఉంటుంది.

న్యూస్‌రీల్

శివాలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గోత్ర నామార్చనలు, అన్నాభిషేకం, ధూపదర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరం

భద్రాచలం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామాలయ ప్రాంగణంలో ఈనెల 13, 14 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, కంటి వైద్య నిపుణులు కె. బాలకృష్ణ, దంత వైద్య నిపుణులు చైతన్య దొర, హైదరాబాద్‌కు చెందిన చర్మ వైద్య నిపుణులు ఎంఎస్ రావు, హోమియోపతి నిపుణులు ఆర్.రవీందర్ పరీక్షలు చేస్తారని వివరించారు. 14న పిల్లల వైద్య నిపుణులు రాజశేఖర్, స్త్రీల వైద్య నిపుణులు స్పందన, షుగర్ వ్యాధి నిపుణులు శివరామకృష్ణ ప్రసాద్ పరీక్షలు చేస్తారని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీలను నియమిస్తామని, ఆశావాహులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని ఐదు స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలకు ఎప్పుడే అవసరం వచ్చినా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకుడు గద్దం రాజశేఖర్, టీపీసీసీ వైరా నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ మాలోత్ రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, వీరభద్రం, వెంకట్, పసుపులేటి వీరబాబు, అల్లాడి నరసింహారావు, ఏదారి ప్రదీప్, చింతిరాల సుధీర్, చెన్నారావు, అజ్మీర సురేష్, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఆకాంక్షలు నెరవేర్చకుండానే సంబరాలా?



నిరసనలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: నిలువెత్తు ఉద్యమం, వందలాది మంది బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చకుండానే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరపడం గర్హనీయమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద సోమవారం తెలంగాణ ప్రజా ఆకాంక్షల దీక్ష దివస్ కార్యక్రమాన్ని చేపట్టగా ఆయన మాట్లాడారు. యువకులు, సకలజనులు తెలంగాణ కోసం ఉద్యమించి ఉద్యోగాలు వస్తాయని, బతుకులు బాగుపడుతాయని భావిస్తే ఆశలపై నీళ్లు చల్లిన కేసీఆర్‌కు భవిష్యత్‌లో తగిన శాస్తి జరుగుతుందన్నారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా, కాంట్రాక్టు ఉద్యోగాల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పోడు దరఖాస్తుదారులందరికీ కాకుండా 4,359 ఎకరాలకే పట్టాలు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సీ.వై.పుల్లయ్య, గండమాల రామయ్య, ఆవుల అశోక్, కంకణాల అర్జున్‌రావు, మలీదు నాగేశ్వరరావు, ఎ.వెంకటరెడ్డి, కమ్మకోమటి నాగేశ్వరరావు, సీహెచ్.శిరోమణి, టి.ఝాన్సీ, ఆవుల మంగతాయి, కొయ్యల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొత్త డిజైన్లు.. పాత ధరలు !

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆకర్షణీయంగా యూనిఫామ్
- మారిన డిజైన్‌తో టైలర్లకు పెరిగిన పని
- అయినా ఐదేళ్ల కిందటి మేకింగ్ చార్జీలే అమలు
- కుట్టు కూలి పెంచాలంటున్న దర్జీ సంఘాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	1065
విద్యార్థుల సంఖ్య	72,548
సిద్ధమైన యూనిఫామ్	83,715
ఇంకా సిద్ధం కావాల్సినవి	61,381

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ ఏడాది నుంచి కొత్త డిజైన్లలో యూనిఫామ్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆకర్షణీయమైన డిజైన్లు ఖరారు చేసి టైలర్లకు పనులు అప్పగించింది. అయితే పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, మారిన డిజైన్ల కారణంగా యూనిఫామ్ తయారీతో నష్టాలే తప్ప లాభాలు వచ్చే పరిస్థితి లేదని దర్జీల సంఘాలు అంటున్నాయి.

పెరిగిన ధరలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు ప్రభుత్వం రెండేసి జతల యూనిఫామ్ ఉచితంగా అందిస్తోంది. ఈ మేరకు మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా మెటీరియల్ సరఫరా చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, దర్జీలు పలు పాఠశాలలకు ఇప్పటికే ఒక్కో జత చొప్పున యూనిఫాం సిద్ధం చేసి ఇవ్వగా, రెండో జత కుట్టే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పెరుగుతున్న ముడి సరుకుల ఖర్చులు వారికి ఇబ్బందికరంగా మారాయి. గత ఐదేళ్లుగా ఒక్కో యూనిఫాం కుట్టినందుకు రూ.50 వంతున ప్రభుత్వం దర్జీలకు చెల్లిస్తోంది. ఐదేళ్లుగా ఈ ధరలు ఏమాత్రం పెరగలేదు. కానీ ఐదేళ్ల క్రితం హోల్‌సేల్ మార్కెట్‌లో ఆరు వందల గుండీల ప్యాకెట్ ధర రూ.60 ఉండగా ఇప్పుడు రూ.85కు చేరింది. మరోవైపు దారం బాక్స్ ధర రూ.120 నుంచి రూ.150కి పెరిగింది. దీనికి తోడు జీవన వ్యయంలో పెనుమార్పులు వచ్చాయి. ఈ నేపథ్యాన దర్జీలకు ఒక్కో డ్రెస్‌పై వచ్చే మార్జిన్ తగ్గిపోతోంది.

మారిన డిజైన్‌తో..

ప్రభుత్వం అందించే స్కూల్ యూనిఫామ్ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉండాలనే లక్ష్యంతో ఈసారి డిజైన్లు మార్చారు. బాలికలకు కొత్తగా షర్ట్‌పై స్కర్ట్, బాలుర చొక్కాలకు సంబంధించి భుజాలు, హ్యాండ్స్, బటన్స్ పెట్టే దగ్గర, షర్ట్ కింది భాగాన అదనపు వస్త్రాన్ని జోడిస్తూ కొత్త డిజైన్ ఖరారు చేశారు. ఈ డిజైన్లకు తగ్గట్టుగా క్లాత్‌ను కత్తిరించడం దగ్గర నుంచి కుట్టడం వరకు పని భారం పెరుగుతోంది. దీంతో గతంలో ఒక్కో షర్ట్‌కు రూ.10 వంతున వర్కర్లకు చెల్లించగా, ఇప్పుడు రూ.20 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఇక ప్యాంట్ చార్జీ రూ.15 నుంచి రూ.20కి, కట్టింగ్ చార్జ్ రూ.7 నుంచి రూ.10కి పెరిగాయి. వీటితో పాటు ఇతరత్రా ఖర్చులు సైతం ఒక్కో జతకు రూ.9 నుంచి రూ.10కి పెరిగాయి. అంతేకాదు డిజైన్ మార్చడం వల్ల పని భారం కూడా పెరిగిందని టైలర్లు అంటున్నారు. గతంలో పది రోజుల్లో చేసే పనికి ఇప్పుడు పదిహేను రోజుల వరకు పడుతోందని చెబుతున్నారు.

ధరలు పెంచాలి..

స్కూల్ యూనిఫామ్‌కు సంబంధించి ఒక్కో డ్రెస్‌కు కుట్టుకూలి ఐదేళ్ల క్రితం నిర్ణయించిన రూ.50 ధరను పెంచాలని దర్జీలు కోరుతున్నారు. ప్రస్తుత ధరలు, మారిన డిజైన్ ఆధారంగా ఒక్కో డ్రెస్‌కు రూ.80 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్‌లో సగటున ఒక డ్రెస్‌కు రూ.700 పైగా కుట్టుకూలీ చార్జీ ఉందని.. అందులో కనీసం పది శాతమైనా తమకు ఇవ్వాలని అంటున్నారు. వేసవి కాలంలో ఎండ, ఉక్కపోతను తట్టుకుంటూ రేయింబవళ్లు యూనిఫామ్ తయారీలో నిమగ్నమైన తమ కష్టానికి తగ్గ ఫలితం వచ్చేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా యూనిఫామ్ అందివ్వాలనే ప్రభుత్వ సంకల్పం మంచిదే అయినా అందుకు తగ్గట్టుగా మేకింగ్ చార్జీలు సవరిస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తల్లిదండ్రులు అంటున్నారు. లేకుంటే కుట్టుకూలి సరిపోక నష్టాలను భరించలేని దర్జీలు నాసిరకంగా కుట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫలితంగా కార్పొరేట్‌కు దీటుగా ఏమో కానీ అసలుకే ఎసరు వచ్చేలా యూనిఫామ్ ఉంటే ప్రభుత్వం లక్ష్యం నెరవేరదనే వాదన వినిపిస్తోంది.



యూనిఫామ్ కుడుతున్న దర్జీలు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు భేష్

- కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా
- ఉత్సాహంగా 2 కే రన్

కొత్తగూడెంరూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి అభినందనీయమని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుంచి కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు 2కే రన్ నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, తద్వారా ఎంతోమంది లబ్ధి పొందారని చెప్పారు. జిల్లా జడ్జి పాటిల్ వసంత్ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ విజయవంతం అయిందన్నారు. ఎస్పీ వినీత్ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములవుతున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్ : అన్ని వర్గాల వారు ఐక్యంగా ఉన్నారని చాటేదే 3కే రన్ అని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భద్రాచలంలోని జూనియర్ కళాశాల నుంచి బ్రిడ్జి సెంటర్ వరకు నిర్వహించిన 3కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరూ నిత్యం పరుగు, నడక, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఏఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ద్వారా 3కే రన్ ప్రారంభించామని చెప్పారు. రన్ నిర్వహణకు సహకరించిన వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, అసిస్టెంట్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సాంబదుర్గ, 141 సెకండ్ బెటాలియన్ కమాండెంట్ కమల్ వీర్ యాదవ్, సంజీవ్ భగత్, కృష్ణారెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్ఐ యాకూబ్, స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఐటీడీఏ మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్ తదితరులు



భద్రాచలంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా తొలి అమరుడు రామటెంకి శ్రీకాంత్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన రామటెంకి అశోక్‌కుమార్ వినతిపత్రం అందించగా పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఓఎస్‌డీకి ఎండార్స్ చేశారు.
- పాల్వంచ మండలం పాండురంగాపురం తండాకు చెందిన సర్పంచ్ అజ్మీరా జగదీష్‌కుమార్ పంచాయతీ భవన నిర్మాణానికి మంజూరు జాబితాలో పాండురంగాపురం అని ఇచ్చారని, దాన్ని పాండురంగాపురం తండాగా మార్చాలని వినతిపత్రం అందించగా తగు చర్యల నిమిత్తం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఎండార్స్ చేశారు.
- తాము పోడు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఆ భూములకు పట్టాలు జారీ చేయాలని, రేషన్ కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేయాలని, విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని పాత గుండాలపాడు గ్రామపంచాయతీ చలమన్ననగర్‌కు చెందిన 104 కుటుంబాల గిరిజనులు చేసిన దరఖాస్తును చర్యల నిమిత్తం సంక్షేమ, విద్యా శాఖాధికారులకు ఎండార్స్ చేశారు.



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై ప్రజలకు అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ అన్నారు. సోమవారం ఆయన కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి దశ పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటుహక్కు వినియోగించుకున్న తర్వాత వీవీప్యాట్‌లో రశీదు నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా నమూనా బ్యాలెట్‌తో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన నమూనా ఓటింగ్ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారి పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, సీపీఎం, బీజేపీ, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు లిక్కి బాలరాజు, లక్ష్మణ్ అగర్వాల్, ఝెర్రా కామేష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా దినోత్సవం

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. సోమవారం అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఐదు నియోజకవర్గాల్లో వేడుకల నిర్వహణకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. పినపాక నియోజకవర్గ వేడుకలు మణుగూరు హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ పర్యవేక్షిస్తారని, కొత్తగూడెం నియోజకవర్గ వేడుకలు చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్‌లో కమ్మ సత్రంలో మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు పర్యవేక్షిస్తారని తెలిపారు. అశ్వారావుపేట వేడుకలు గిరిజన భవన్‌లో డీఆర్‌డీఓ మధుసూధన్‌రాజు పర్యవేక్షిస్తారని, ఇల్లెందు మార్కెట్ యార్డులో జరిగే వేడుకలను ఉద్యాన అధికారి మరియన్న, భద్రాచలం గిరిజన అభ్యుదయ భవన్‌లో జరిగే వేడుకలను సహకార అధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తారని వివరించారు.

రామాలయంలో దశాబ్ది వేడుకలు

వైభవంగా 'భద్రగిరి' ప్రదక్షిణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం అంతరాలయం నుంచి భక్త రామదాసు చిత్రపటంతో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో స్వామి వారిని వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు విజయరాఘవన్, ఆలయ ఈఓ రమాదేవి, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్, ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాస్, సీసీ అనిల్, సిబ్బంది స్వర్ణకుమారి, సునిత తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య..

దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, ఈఓ తదితరులు

రేపటి నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 14 నుంచి 22 వరకు జరుగుతాయని డీఈఓ ఇ.సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందు కోసం జిల్లాలో 12 సెంటర్లు ఏర్పాటు చేశామని, 12 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 160 మంది ఇన్విజిలేటర్లు, 12 మంది సిట్టింగ్ స్క్వాడ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశామని, విద్యార్థులతో పాటు విధులు నిర్వర్తించే సిబ్బందికి కూడా సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు.

లక్ష్మణరేఖ దాటుతున్న గవర్నర్..

- పాండిచ్చేరిలో 100 క్లబ్‌లకు అనుమతిచ్చిన తమిళిసై
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

సత్తుపల్లిటౌన్: తెలంగాణ గవర్నర్ తమిళిసై బీజేపీ నాయకురాలిగా వ్యవహరిస్తూ లక్ష్మణరేఖ దాటి రాజకీయాలు మాట్లాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. కొత్తగూడెం నుంచి విజయవాడ వెళ్తున్న ఆయన సోమవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాదర్బార్లు నిర్వహించడం, పరిధిని మించి పెత్తనం చెలాయించాలని ప్రయత్నం చేస్తూ అతిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బ్రిటీష్‌వాళ్లు వదిలి వెళ్లిన ఈ గవర్నర్ వ్యవస్థ అనేదే దండగమాలినదని, దళారీ పాత్రలా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటంకాలు ఎదుర్కొని బయటపడ్డానంటూ గవర్నర్ తమిళిసై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నామినేట్ చేయబడిన గవర్నర్ పదవిని పార్లమెంట్ సభ్యులు ఎన్నుకున్న రాష్ట్రపతి పదవితో పోల్చుకోవటం ఏమిటని ప్రశ్నించారు. సచివాలయానికి తనను పిలవలేదని చెబుతుండగా.. పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించటానికి రాష్ట్రపతిని పిలవకుండా అవమానపరిచిన మోదీ సన్యాసులతో పార్లమెంట్‌ను నింపారని విమర్శించారు. కాగా, పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా కొనసాగుతున్న తమిళి సై మహిళ అయి ఉండి అక్కడ వంద క్లబ్‌లకు అనుమతించారని ఆరోపించారు. ఇక తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల కాలంలో బీజేపీని వ్యతిరేకించడంలో కొంద నెమ్మదించినట్లు కన్పిస్తుందని, బీజేపీ అనే రాక్షసి మీద బలంగా పోరాడితే తప్ప ఆలోచించి నెమ్మదపడితే అది తినేస్తుందని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీని ఓడించటానికి అన్ని శక్తులు ఏకమవుతున్న నేపథ్యాన కేసీఆర్ కూడా కలిసి రావాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకికవాద రక్షణ కోసం బీజేపీని ఓడించటమే సీపీఐ లక్ష్యమని నారాయణ స్పష్టం చేశారు. ఆయన వెంట నాయకులు అక్కినేని వనజ, చలసాని రామారావు, దండు ఆదినారాయణ, నిమ్మటూరి రామకృష్ణ, టి.యోబు, మల్లెపూల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తొలిరోజు సగమే

- జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభం
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ
- ఎండవేడి, ఉక్కపోతతో ఇక్కట్లు
- తరగతి గదులు సరిపోక మరోబడికి సిఫారసు చేస్తున్న టీచర్లు



పాల్వంచ మండలం జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: విద్యా సంవత్సరం తొలిరోజైన సోమవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సగం మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఎండ తీవ్రత ఇంకా కొనసాగుతుండడంతో తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపేందుకు భయపడ్డారు. ఇంకొందరు విద్యార్థులు సెలవుల్లో ఊర్లకు వెళ్లి ఇంకా తిరిగి రాకపోవడం కూడా మరో కారణంగా చెబుతున్నారు. మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులు గదులు సరిపోక ఇబ్బంది పడ్డారు. పాఠశాలలకు అడ్మిషన్లు వస్తుండగా సమీపంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలకు వెళ్లమని ఉపాధ్యాయులే చెబుతుండడం గమనార్హం. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగూడెం పట్టణంలోని మేదరబస్తీ, కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా తరగతులు గదులు లేవు. దీంతో విద్యార్థులను ఆవరణలో నేలపై పట్టాలు వేసి కూర్చోబెట్టాల్సి వస్తోంది. జిల్లాలోని మరికొన్ని స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక ఎండల తీవ్రత తగ్గకపోవడం, ఉక్కపోతతో తొలిరోజు విద్యార్థులు సతమతమయ్యారు. జిల్లాలోని అన్ని విభాగాల ప్రభుత్వ పాఠశాలల్లో 54,696 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు 28,784 మంది (52.62 శాతం) మాత్రమే హాజరయ్యారు. ఇక ప్రైవేటు పాఠశాలలను మాత్రం ఒకపూటే నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలను డీఈఓ సోమశేఖరశర్మ సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

బడులకు నూతన హంగులు..

నూతన పాఠ్యపుస్తకాలు, నూతన యూనిఫామ్, మన ఊరు–మనబడి కార్యక్రమంతో నూతన హంగులు దిద్దుకున్న పాఠశాలలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. 70 శాతానికి పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్ అందజేశామని, మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో ఇస్తామని చెప్పారు. తొలిరోజు బడికి రాని పిల్లల వివరాలు సేకరించి నేటి నుంచి 100 శాతం హాజరు నమోదయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరగ్గా, జనరల్ సబ్జెక్టులకు 1,498 మందికి గానూ 1409 మంది హాజరయ్యారు. 89 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ గ్రూప్‌లో 228 మందికి 192 మంది హాజరు కాగా, 36 మంది గైర్హాజరయ్యారు. రెండో సంవత్సరానికి సంబంధించి మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్ష జరగ్గా, జనరల్ విభాగంలో 405 మందికి 378 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ గ్రూప్‌లో 86 మందికి 66 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరయ్యారని జిల్లా నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు.

నేడు పామాయిల్ రైతుల సదస్సు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర సదస్సును మంగళవారం అశ్వారావుపేటలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం బాధ్యులు కొక్కెరపాటి పుల్లయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించే సదస్సుకు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తదితరులు హాజరవుతారని తెలిపారు. పామాయిల్ రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

గాలి వాన బీభత్సం



ములకపాడులో హోటల్‌పై కూలిన చింతచెట్టు

దుమ్ముగూడెం: మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుమ్ముగూడెం క్రాస్ రోడ్డులో నిర్మించిన ప్రెస్ క్లబ్ కూలిపోయింది. రేకులు సుమారు 300 మీటర్ల దూరంలో ఎగిరి పడ్డాయి. కొన్ని రేకులు తగిలి సమీపంలోని రైస్ మిల్లు టవర్ విరిగి పడిపోయింది. గాలివానకు అంజిపాక గ్రామానికి చెందిన మడకం చిన్నక్క ఇల్లు మొత్తం నేలమట్టమయింది. ములకపాడులో భారీ చింత చెట్టు కూలి ఓ హోటల్‌పై పడింది.

సర్వే అధికారుల అడ్డగింత



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో సీతమ్మ సాగర్ ప్రాజెక్టు రెండో విడత సర్వే కోసం సోమవారం వచ్చిన రెవెన్యూ అధికారులను నిర్వాసితులు అడ్డుకున్నారు. తహసీల్దార్ మణిధర్ తమ సర్వే సిబ్బందితో గ్రామానికి రాగా.. పలువురు నిర్వాసిత రైతులు మాట్లాడుతూ మొదటి విడతలో ఇచ్చిన నష్ట పరిహారం సమంజసం లేదని, ఈసారి కూడా అంతేమొత్తం ఇస్తే న్యాయం కాదని పేర్కొన్నారు. తమకు ఎకరం , రెండెకరాలు మాత్రమే ఉందని, భూమికి భూమి కేటాయించాలని, లేకపోతే ఎకరాకు రూ.30 లక్షల పరిహారం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందచేశారు. దీంతో చేసేది ఏమిలేక అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కొమరం దామోదరరావు, పర్ణశాల ఉప సర్పంచ్ ఖాదర్ బాబు, పీసా కమిటీ కార్యదర్శి వాగె రాజేశ్వరి, కారం నవీన్, శకినం కృష్ణమూర్తి, సమ్మక్క, నానమ్మ, కాంతమ్మ, శకినం శ్రీను, సోయం వీర్రాజు పాల్గొన్నారు.

నేటినుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలను మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఏ.నరేందర్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 131 కేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14, 16, 19, 21, 23, 25, 28, జూలై 3, 5, 7వ తేదీల్లో, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4, 6,10, 11, 12, 13, 14వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

పక్కాగా పౌష్టికాహారం..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ ముద్ర వేసిన గుడ్లు పంపిణీ
- ముద్రలో సంబంధిత జోన్ నంబర్ కూడా...
- పారదర్శకతకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలు



లబ్ధిదారులకు గుడ్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే గుడ్లపై ప్రత్యేకంగా ముద్ర వేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలల నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలకు నెలకు 16 గుడ్లు, గర్భిణులు, బాలింతలకు రోజుకొకటి చొప్పున గుడ్లను అందిస్తున్నారు. చిన్నారులకు కేంద్రాల్లోనే గుడ్లు ఉడికించి పెడుతుండగా, వివిధ కారణాలతో కొందరు మహిళలు స్థానికంగా లేకపోయినా వారికి గుడ్లు అందజేసినట్లు రికార్డుల్లో రాసుకుని కొందరు సిబ్బంది దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో గుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్లు.. తెలంగాణ ప్రభుత్వం' అని ముద్రవేయనున్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు నెలకు రెండు తడవలుగా, మిగిలిన నెలల్లో వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా మూడు విడతలుగా గుడ్లు అందిస్తున్నారు. ఇక నుంచి మొదటి విడతలో గుడ్లపై నీలం, రెండో విడత గుడ్లపై ఎరుపు రంగు ముద్రలు వేసి పంపిణీ చేయనున్నారు. వేసవి వరకు మూడో విడత గుడ్లపై ఆకు పచ్చ రంగు ముద్రవేసి పంపిణీ చేస్తారు. ముద్ర మధ్యలో 5 మి.మీ. పొడవు, వెడల్పుతో సంబంధిత జోన్ నంబర్ కూడా పేర్కొంటారు. ఇప్పటికే ఈ ప్రక్రియ జిల్లాలో మొదలు కాగా గత శనివారం భద్రాచలం నియోజకవర్గం పరిధిలోని చర్ల మండల అంగన్‌వాడీ కేంద్రాలకు ముద్రించిన గుడ్లు చేరాయి. కాగా ముద్ర వేసిన గుడ్లు ఎవరైనా మార్కెట్‌లో విక్రయిస్తే సత్వరమే గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ గుడ్లను కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ సిస్టం ద్వారా బ్యాచుల వారీగా సరఫరా చేయనున్నారు.

నిత్యం 14.55 లక్షల గుడ్లు పంపిణీ..

జిల్లా వ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాల్లో 9,551 మంది గర్భిణులు, 4,565 మంది బాలింతలు, 7 నెలల లోపు చిన్నారులు 4,565 మంది, 7 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 37,351 మంది ఉన్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 31,341 ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకం కింద కేంద్రాలు పనిచేసే దినాలను బట్టి నెలకు 26 గుడ్లు, 200 మిల్లీ లీటర్ల పాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. పోషకాహార లోపం ఉన్న లబ్ధిదారులకు రోజుకు 2 గుడ్లను అందజేస్తున్నారు. ఇలా నిత్యం 14.55 లక్షలకుపైగా గుడ్లను పంపిణీ చేస్తున్నారు. ఇకపై కాంట్రాక్టర్ ముద్రలేని గుడ్లు సరఫరా చేస్తే అంగన్‌వాడీ టీచర్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.



నీలం రంగు ముద్ర వేసిన గుడ్లు

అవకతవకలకు తావులేకుండా..



అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న గుడ్లు పక్కదారి పట్టకుండా ప్రత్యేకంగా ముద్ర వేసి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఒక్కో విడతలో పంపిణీ చేసే గుడ్లపై ఒక్కో రంగు ముద్ర వేయడంతో ఏ విడత గుడ్లు పక్కదారి పట్టాయో పక్కాగా గుర్తించేందుకు వీలుంటుంది. దీంతో అక్రమాలు లేకుండా చూడొచ్చు.

– సరిత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

డీఈఓ సోమశేఖర శర్మ

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని డీఈఓ సోమశేఖర శర్మ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం, గతేడాది పదో తరగతి ఫలితాలపై హెచ్‌ఎం మోహన్‌రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రుగొండ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల్లో డీఈఓ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. బడిబాట కార్యక్రమం సమర్థంగా నిర్వహిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. పాఠ్యాంశాల బోధన ప్రారంభించాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉండేటి ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ



చంద్రుగొండ: హాజరుశాతం తక్కువగా ఉండటంతో ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేస్తున్న డీఈఓ

నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: 'డు ఇట్ యువర్ సెల్ఫ్ సైన్స్ హెక్తాన్'లో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి కనీసం రెండు కొత్త ఐడియాల(నూతన ఆవిష్కరణలు)ను అప్‌లోడ్ చేయాలని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆశ్రమ, రెసిడెన్షియల్, కస్తూర్బా, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. గణితం, ఫిజికల్ సైన్స్, జీవశాస్త్రాలకు సంబంధించిన సబ్జెక్టుల్లోని ప్రధానాంశాలపై కొత్త ఐడియాలను రూపొందించి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు. ఒక్కో గ్రూపులో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండాలని, ప్రధానోపాధ్యాయులకు, ఎంఈఓలకు ఇప్పటికే 77 టాపిక్స్ పంపించామని తెలిపారు. విద్యార్థుల ఐడియా కిట్ రూ.200కు మించి ఉండొద్దని చెప్పారు. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఐడియా కిట్లను తయారు చేసుకుని ఈ నెల 20న మాత్రమే యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పూర్తి వివరాలకు డీఈఓ చలపతిరాజును 92472 96012 నంబరులో సంప్రదించాలని కోరారు.

జలాధివాసం



బిందెలతో తరలివస్తున్న మహిళలు

ములకలపల్లి మండల పరిధిలోని నర్సాపురం గ్రామశివారులో వేంచేసి ఉన్న కోటిమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు సాగే వేడుకల్లో తొలిరోజు నిర్వహించిన జలాధివాసానికి మహిళలు భారీగా హాజరయ్యారు. బిందెలతో పూజాక్రతువులో పాల్గొన్నారు. వేకువజామునే ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రంవేళ అంగరంగవైభవంగా అమ్మవారి ఊరేగింపు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

– ములకలపల్లి

ఐడీఓసీలో బ్యాటరీ వాహనం !

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ-కలెక్టరేట్)లో బ్యాటరీ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధాన ద్వారం నుంచి కలెక్టరేట్ లోపలకు వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులు ఇబ్బంది పడకుండా ఎనిమిది సీట్ల బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించారు. దీంతో దివ్యాంగులు, వయోవృద్ధులతోపాటు వేసవి తీవ్రత నేపథ్యాన మహిళలు కూడా సోమవారం ఈ వాహనాన్ని వినియోగించుకున్నారు.



బ్యాటరీ వాహనంలో మహిళలు

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

భద్రాచలంటౌన్/బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటీఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడ్‌లలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 20 సీట్లు, ఎలక్ట్రానిక్ మెకానికల్‌లో 24 సీట్లు, ఇనుస్ట్రుమెంటేషన్‌లో 24 సీట్లు, ఫిట్టర్‌లో 20 సీట్లు, మోటార్ మెకానికల్‌లో 24 సీట్లు, కోపా విభాగంలో 48 సీట్లు ఉన్నట్లు వివరించారు. 2023, ఆగస్టు 1 నాటికి 14 ఏళ్లు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ఈ నెల 19వ వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

బీజేపీ బహిరంగ సభకు తరలిరావాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సత్యవతి

చర్ల: ఈనెల 15న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే బీజేపీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని వద్దిపేట, చినమిడిసిలేరు, సీ కత్తిగూడెం, కొత్తూరు, తేగడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. సభకు కేంద్రం హోంమంత్రి అమిత్‌షాతో పాటు కేంద్ర, రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపా రు. నాయకులు బిట్రుగుంట క్రాంతికుమార్, సంతపురి సురేష్‌కుమార్, నక్కా కన్నారావు, యడవల్లి శేషగిరిరావు, ఆలెం సమ్మయ్య, బోడిక సోమరాజు, చిడెం గోపి, పూనెం రాణి, పూనెం చంద్రకళ, సోడి జానకి, కణితి రుక్మిణి, పర్శిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనను విజయవంతం చేయాలి

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలో జరిగే బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటనను విజయవంతం చేయాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ కోరారు. భద్రాచలం పట్టణంలోని తెలంగాణ టూరిజం హోటల్‌లో మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు బలరాం, తిరుపతిరెడ్డి, కొత్త సురేందర్, రఘు, రామ్మోహన్‌రావు, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పాల్వంచ: పురుగుల మందు తాగిన యువకుడు సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన దెబ్బగట్ల భీమయ్య కుమారుడు అడమయ్య(24) ఏడాదికాలంగా పాల్వంచ పట్టణ పరిధిలోని బంగారుజాల గ్రామంలో అరుణ్ రెడ్డి పామాయిల్ తోటలో పనిచేస్తున్నాడు. కాగా అతడు పామాయిల్ తోటకు తెచ్చిన పురుగుల మందును ఆదివారం రాత్రి తాగాడు. సమాచారం తెలుసుకున్న స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని బాబాయి ముసకి హైతు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. కాగా అడమయ్య ప్రేమ విఫలం చెందడంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

దైవదర్శనానికి వెళ్లి బాలుడి మృతి



రణదేవ్ (ఫైల్)

చంద్రుగొండ : దైవదర్శనం కోసం కుటుంబంతో కలిసి వెళ్లిన బాలుడు అక్కడి వాగులో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. మండల కేంద్రం చంద్రుగొండలోని శ్రీనగర్ కాలనీ (దళితవాడ)కు చెందిన పెంబుల లక్ష్మీనారాయణ, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు తరుణ్‌తేజ్, రణదేవ్(14) ఉన్నారు. వీరు నలుగురితోపాటు రేపల్లెవాడలో ఉండే అమ్మమ్మ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తెల్లవారుజామున ప్రయాణమై అంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మతల్లి దర్శనానికి వెళ్లారు. స్నానం చేసేందుకు అక్కడి మున్నేరు వాగులోకి దిగారు. స్నానం చేస్తున్న క్రమంలో ఊబిలో ఇరుక్కుపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి బయటకు తీసేలోపే మృతి చెందాడు. కాగా రణదేవ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బాలుడు మృతితో దళితవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వరకట్న వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన త్రిష(23)కు కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన వేము శరత్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు జన్మించాడు. కాగా కొద్దిరోజులుగా శరత్ తాగిన మైకంలో భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. శరత్ కుటుంబ సభ్యురాలు అయిన వేము దేవకరుణ కూడా అదనపు కట్నం కోసం త్రిషను వేధింపులకు గురిచేస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

సర్పంచ్, ఉప సర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరికేస్తాం..

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో అభివృద్ధి పనులకే కాక గనులు తెరిచేందుకు సహకరిస్తే సర్పంచ్, ఉపసర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరకడమే కాక ఇంకా ఎవరైనా ఉంటే హతమరుస్తామని మావోయిస్టులు హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా బ్లాక్‌లో నది నీటిని నిల్వ చేసేందుకు కరకట్ట నిర్మిస్తున్నారు. ఆది నుంచి ఈ పనులను వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు నిలివేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ఓర్చా సమీపంలోని ప్రధాన రహదారి వెంట వాల్‌పోస్టర్లు వేయడంతో పాటు బ్యానర్లు కట్టారు. నదిలో కరకట్ట నిర్మాణ పనులతో పాటు, ఈ ప్రాంతంలో గనుల్లో తవ్వకాలను నిలిపివేయాలని అందులో హెచ్చరించారు. ఈ పనులకు సహకరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ల కాళ్ల చేతులు నరికివేయడమే కాక గైతాపారా, బెస్మెట్ట గ్రామాల ప్రజలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని మావోయిస్టులు పేర్కొన్నారు.



నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన బ్యానర్

వ్యక్తి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి అదృశ్యంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మహంకాళి నాగేశ్వరరావు విజయవాడ వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి ఈ నెల 2న బయల్దేరి వెళ్లాడు. ఆ తర్వాత ఈ నెల 4న శ్రీకాళహస్తిలో ఉన్నట్లు ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం వారం రోజులు గడిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య బాలత్రిపుర సుందరి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాహం తీరాక.. అలుగు నుంచి రాలేక..


తీవ్రమైన ఎండలతో మూగజీవాలు కూడా దాహంతో అల్లాడుతున్నాయి. ఓ ఎద్దు తాగునీటి కోసం మండల పరిధిలోని సింగభూపాలెం చెరువు అలుగులోకి దిగింది. నీళ్లు తాగాక ఎంత ప్రయత్నించినా బయటకు రాలేకపోయింది. స్థానికులు గమనించి ప్రయత్నించినా బయటకు తీయలేకపోయారు. దీంతో ఎద్దును కాపాడాలంటూ వారు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

– సుజాతనగర్



వార్ధాపై 'మహా' మెలిక !

- ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేయాలన్న మహారాష్ట్ర
- గతేడాది మేడిగడ్డకు వరదలతో తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని వెల్లడి
- స్థానికంగా, రాజకీయంగా ఇబ్బందులెదుర్కొన్నట్లు లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో ప్రతిపాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 'వార్ధా' ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపే విషయంలో మహారాష్ట్ర కొత్త మెలిక పెట్టింది. 155–160 మీటర్ల నిడివిలో వేర్వేరు పూర్తిస్థాయి నిల్వమట్టాల (ఎఫ్‌టీఎల్)తో వార్ధా బ్యారేజీ నిర్మిస్తే ఉండనున్న ముంపు ప్రభావం, ప్రభావితం కానున్న గ్రామాలపై ఇప్పటికే మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఇంజనీర్ల బృందం సర్వే నిర్వహించి నివేదిక సమర్పించింది. అయితే గతేడాది జూలైలో గోదావరికి వరదలు పోటెత్తడంతో మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్ కారణంగా తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని, ఈ నేపథ్యంలో వేర్వేరు ఎఫ్‌టీఎల్ స్థాయిల వద్ద వార్ధా బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో ఉండనున్న ముంపుపై మళ్లీ అధ్యయనం జరపాలని మహారాష్ట్ర స్పష్టం చేసింది. ఈ మేరకు మహారాష్ట్ర జలవనరుల శాఖ అంతర్రాష్ట్ర విభాగం సహాయ చీఫ్ ఇంజనీర్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ రాశారు. మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన వరదతో స్థానికంగా, రాజకీయంగా మహారాష్ట్రలో తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని, బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ సర్వే జరపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్ల స్థాయిలో ఈ అంశాన్ని పరిష్కరించుకున్న తర్వాతే అంతరాష్ట్ర బోర్డు సమావేశం నిర్వహించాలని కోరింది.

అంతరాష్ట్ర ఒప్పందానికి మరింత జాప్యం!

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించడానికి పరస్పర అంగీకారం తెలుపుతూ 2016 ఆగస్టు 23న జరిగిన అంతర్రాష్ట్ర బోర్డు సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు సంతకాలు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని పక్కనపెట్టింది. దీనికి బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. ఈ కారణంగా నష్టపోయిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించడానికి తుమ్మిడిహట్టికి బదులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేట వద్ద వార్ధా నదిపై బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రూ.4,550.73 కోట్లతో ప్రాజెక్టు నివేదికను అనుమతుల కోసం ఇటీవల కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) సమర్పించింది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి గతంలో చేసుకున్న ఒప్పందాన్ని సవరించడం ద్వారా వార్ధా బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలపాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసింది. ఇందుకోసం అంతర్రాష్ట్ర బోర్డు సమావేశం నిర్వహించాలని కోరింది. అయితే దీనికి ముందే బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం జరపాలని తాజాగా మహారాష్ట్ర కోరడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్టు అయింది. వార్ధా ప్రాజెక్టు కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,34,880 ఎకరాల ఆయకట్టుకు, మరో 5,868 ఎకరాల స్థిరీకరణకు ప్రభుత్వం ప్రతిపాదించింది.

నల్లగొండలో నీళ్ల మంటలు!

▶ మొదటి పేజీ తరువాయి

పాదయాత్ర ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులే లక్ష్యంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ హయాంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన శ్రీశైలం సొరంగ మార్గం, నక్కలగండి, పెండ్లిపాకల, బ్రాహ్మణ వెల్లంల వంటి ప్రాజెక్టులపై భట్టి చర్చ పెడుతున్నారు. ఈ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చూపుతోందని.. జిల్లాకు చెందిన మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పట్టించుకోవడం లేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నక్కలగండి రిజర్వాయర్ కింద నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఆ తర్వాత రెండు రోజులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన కృషి ఉందని.. హైదరాబాద్‌కు దాని ద్వారానే తాగునీళ్లు వచ్చాయని చెప్పారు. ఇక జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదివారం మీడియా సమావేశం పెట్టి.. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని దుర్మార్గమైన టెక్నాలజీతో తెచ్చారని, పర్యావరణ అనుమతుల పేరుతో ఆగిపోయేలా చూశారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. దీనికి ప్రతిగా సోమవారం భట్టి విక్రమార్క మరోసారి విరుచుకుపడ్డారు. ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్న దానికి నేరుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

భట్టికి తోడుగా కోమటిరెడ్డి, ఉత్తమ్..

భట్టి పాదయాత్రలో పాల్గొన్న ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ఎస్ఎల్‌బీసీ కోసం నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి, 2005లో అనుమతి తీసుకొని పనులు మొదలుపెట్టి 70శాతం పూర్తి చేస్తే.. బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని పనులు పూర్తి చేయిస్తానని 2014లో ప్రకటించిన సీఎం కేసీఆర్.. తర్వాత దీనిని పట్టించుకోకుండా, కమీషన్ల కాళేశ్వరంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఇక పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా నల్లగొండ రైతులను సీఎం కేసీఆర్ మోసం చేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా.. భట్టి పాదయాత్ర సందర్భంగా ఈ నెల 15న నల్లగొండ పట్టణంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

> బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి పదేళ్లు కావస్తున్నా ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. ఈ ప్రాజెక్టులు పూర్తి కాకుండా అడ్డుకున్నది ఎవరు? వాటి ద్వారా నల్లగొండ జిల్లా ప్రజలకు నీళ్లు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలి. దీనిపై ఎక్కడైనా చర్చించేందుకు నేను సిద్ధం. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయాంలో నల్లగొండ జిల్లా ప్రజలకు నీళ్లు ఇవ్వకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని సుఖేందర్ రెడ్డి అన్నారట. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే.. ఇన్నేళ్లయినా డిండి, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండిని పూర్తి చేయనందుకు ఇప్పుడు రాజీనామా చేయాలి. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయడానికి కేసీఆర్ నుంచి నిధులు తీసుకురావాల్సిన జిల్లా మంత్రి.. నాగార్జున సాగర్ నుంచి నీళ్లు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు.
>
> – సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

> 2014కు ముందు జిల్లాలో సాగులోకి వచ్చిందెంత? ఇప్పుడు సాగులో ఉన్న భూమి ఎంత? దిగుబడి ఎంత? 40 లక్షల టన్నులకుపైగా ధాన్యం దిగుబడితో రికార్డ్ సృష్టించాం. సాగర్ కింద వరుసగా 16 పంటలకు నీళ్లు ఇచ్చాం. 2014కు ముందు ఏనాడైనా లాఠీచార్జిలు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించారా? ఫ్లోరైడ్ సమస్యను పట్టించుకోకుండా లక్షల మంది నడ్డి విరిచారు. మిషన్ భగీరథతో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టింది కేసీఆర్ కాదా? ఇప్పుడున్న నిరుద్యోగులు డిగ్రీలు ఎప్పుడు పూర్తిచేశారో లెక్కలు తీద్దామా? జిల్లా అభివృద్ధిపై ఎక్కడ చర్చ పెడదామో చెప్పండి. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏరియా జాన్‌పహాడ్‌లో పెడదామా? లేక జానారెడ్డి ఏరియా రాజవరంలో పెడదామా? విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద కరెంటుపై చర్చపెడదామా? మీరే చెప్పండి.
>
> – విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఉద్యమ నేతకు కడసారి వీడ్కోలు



జగదీశ్ కూతురు, కుమారుడిని ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్



పాడె మోస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత తదితరులు

- ములుగు జిల్లా మల్లంపల్లిలో జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు
- మంత్రి కేటీఆర్ సహా పాల్గొన్న పలువురు ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం ములుగు జిల్లా మల్లంపల్లిలో సోమవారం జరిగాయి. జగదీశ్ ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హఠాన్మరణం పొందిన విషయం తెలిసిందే. ఆయనకు కడసారి వీడ్కోలు పలకడం కోసం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. గంటన్నరపాటు జరిగిన జగదీశ్ అంతిమయాత్రలో మంత్రి కేటీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రముఖులు, శ్రేణులు పాల్గొన్నారు. కేటీఆర్‌ను చూడగానే జగదీశ్ తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్ బోరున విలపించారు. కేటీఆర్ వారిని ఓదార్చారు. ఆయన మరణం జిల్లా ప్రజలకు, పార్టీకి తీరనిలోటని కేటీఆర్ అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నారు. అంతిమయాత్రలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ కవిత జగదీశ్ పాడె మోశారు.

శిరీషది హత్యా.. ఆత్మహత్యా?

- అన్ని కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు
- మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం
- కాల్ డేటా ఆధారంగా మరో ఇద్దరిని విచారిస్తున్న పోలీసులు
- హత్యను సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్



శిరీష (ఫైల్)

పరిగి, సాక్షి న్యూఢిల్లీ: పారా మెడికల్ విద్యార్థి శిరీష మృతిపై మిస్టరీ వీడలేదు. యువతిది హత్యా.. ఆత్మహత్యా.. అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కాళ్లాపూర్ శివారులోని నీటి కుంటలో ఆదివారం మధ్యాహ్నం శిరీష (19) మృతదేహం లభ్యమైంది. ఒంటిపై పలు చోట్ల గాయాలు ఉండటం, రెండు కళ్లనూ పొడిచి ఉండటంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం విదితమే. పలువురు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివరాలు ఆరా తీసే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా సోమవారం గ్రామానికి చేరుకున్న వైద్యులు శిరీష మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం నిర్వహించారు. యువతి శరీరంపై గాయాలు ఉన్నట్లు ధ్రువీకరించారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. శిరీషది ముమ్మాటికీ హత్యేనని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి జంగయ్య, బావ అనిల్‌పై వారు మండిపడ్డారు. శిరీష మృతికి వారే కారణమంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు కల్పించుకుని త్వరలోనే పూర్తి వాస్తవాలు తెలుస్తాయని, అప్పటివరకు ఓపిక పట్టాలని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. తన చెల్లిని చంపిన వారు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని మృతురాలి తమ్ముడు శ్రీకాంత్ కోరాడు.

పోలీసుల అదుపులో మరో ఇద్దరు

శిరీష అంత్యక్రియలు ముగిసిన తర్వాత తండ్రి జంగయ్య, బావ అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాల్ డేటా ఆధారంగా గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా.. కేసు దర్యాప్తులో ఉందని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు.

మూడు రోజుల్లో రిపోర్టు పంపండి

తెలంగాణ డీజీపీకి మహిళా కమిషన్ ఆదేశం

శిరీష దారుణ హత్యను జాతీయ మహిళా కమిషన్ సుమోటో కేసుగా స్వీకరించింది. స్క్రూ డ్రైవర్‌తో బాలిక కళ్లు పీకి, బ్లేడ్‌తో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటనపై ఢిల్లీలోని ఎన్సీడబ్ల్యూ సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. అంతేగాక మూడు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను పంపించాలని తెలంగాణ డీజీపీకి సూచించింది. తెలంగాణలో బాలికలు, యువతులు, మహిళలపై పెరిగిపోతున్న నేరాలపై జాతీయ మహిళా కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

కర్నూల్ మెడికల్ కాలేజీలో మల్టీ యుటిలిటీ సెంటర్

రూ.15 కోట్లతో నిర్మించనున్న కేఎంసీజీటీ

సాక్షి, అమరావతి: కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణానికి కర్నూల్ మెడికల్ కాలేజ్ గ్రాడ్యుయేట్ ట్రస్ట్(కేఎంసీజీటీ) ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సమక్షంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, కేఎంసీజీటీ ప్రతినిధులు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ప్రాథమికంగా రూ.15 కోట్ల అంచనాతో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు కేఎంసీజీటీ ప్రతినిధులు తెలిపారు. అవసరమైతే మరిన్ని అదనపు నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సెంటర్‌లో 300 మంది సామర్థ్యంతో వర్చువల్ కాన్ఫరెన్స్ హాల్, డిజిటల్ లైబ్రరీ, ఇతర అధునాతన విద్యా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టినందుకు కేఎంసీజీటీ ప్రతినిధులను కృష్ణబాబు అభినందించారు.

జిల్లా వార్తలు

వచ్చే నెల 3న 'దమ్మక్క సేవా యాత్ర'

ఈనెల 20 నుంచి రామాలయంలో ఆషాఢ మాసోత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఏటా ఆషాఢ మాసంలో జరిగే దమ్మక్క సేవా యాత్ర వచ్చే నెల 3న జరగనుంది. ఈమేరకు ఆషాఢ మాసంలో జరిగే ఉత్సవాల వివరాలను వైదిక కమిటీ బాధ్యులు, ఆలయ ఈఓ రమాదేవి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 20వ తేదీన పునర్వసు నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం, 21న పుష్యమి సందర్భంగా పట్టాభిషేకం, 28న చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శనహోమం జరగనున్నాయి. అలాగే, 29న తొలి ఏకాదశి, పెరియాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఆళ్వార్‌కు స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు ఉంటాయి. ఇక జూలై 3న ఆషాఢ గురుపూర్ణిమ సందర్భంగా దమ్మక్క సేవాయాత్ర, గోవిందరాజస్వామి తిరుకల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. జూలై 13న సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన, 17న ఉత్తరమూర్తులకు స్నపన తిరుమంజనం తదితర పూజలు జరగనున్నాయి.

పల్లె ప్రగతి దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి

పీఆర్ ఆర్‌డీ అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ



కార్మికులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ

ఇల్లెందురూరల్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న పల్లె ప్రగతి దినోత్సవాన్ని ప్రతీ గ్రామపంచాయతీలో ఘనంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ ఆదేశించారు. మండలంలోని సుభాష్‌నగర్, సుదిమళ్ల గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ ఇంట తోరణాలు కట్టుకుని ముగ్గులు వేసేలా చూడాలని, పల్లెప్రగతిలో భాగంగా చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలో వెల్లడించాలని సూచించారు. అంకితభావంతో పనిచేసిన కార్మికులను సన్మానించాలని తెలిపారు. అనంతరం కార్మికులు, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. డీఎల్పీఓ రాజీవ్‌కుమార్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, సర్పంచ్ వల్లాల మంగమ్మ, కార్యదర్శులు రజినీకాంత్, నాగమణి పాల్గొన్నారు.

అన్నింటా రాణిస్తున్న గిరిజన విద్యార్థులు



వేడుకల ప్రారంభ సూచికగా బెలూన్లు వదులుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, తల్లిదండ్రులు

- ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్
- గిరిజన గురుకులాల్లో ఆరంభమైన 'దశాబ్ది' ఉత్సవాలు

భద్రాచలం: ప్రభుత్వం అందజేస్తున్న వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటున్న గిరిజన విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు గిరిజన గురుకులాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భద్రాచలంలోని గిరిజన గురుకుల కళాశాల, పాఠశాలలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు సూచనలతో గిరిజన విద్యాసంస్థల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గిరిజన విద్యాప్రగతికి ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు వెచ్చించగా కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి అధికారులు భోజనాలు చేశారు. బాలికల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తోకల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజన విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థుల విషయంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో భాగంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన దరఖాస్తులను స్వీకరించి యూనిట్ అధికారులకు అందజేశారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆతర్వాత అధికారులతో సమావేశమైన ఏపీఓ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు తెరుచుకున్నందున ప్రారంభం నుంచే బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని తెలిపారు. జీసీసీ డీఎం విజయ్‌కుమార్‌తో పాటు అధికారులు సురేష్‌బాబు, భాస్కరన్, మునీర్‌పాషా, ప్రభాకర్‌రావు, నర్సింగరావు, ఆదినారాయణ, కృష్ణార్జునరావు, ప్రమీలబాయి, దుర్గయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

నష్టం విలువ... రూ.47లక్షలు

- ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదంపై వివరాలు సిద్ధం
- పరిశీలనలో నిమగ్నమైన బీమా కంపెనీ



కాలిపోగా మిగిలిన పత్తిని మార్కెట్‌లో ఆరబెట్టిన దృశ్యం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో పత్తి బస్తాలు కాలిపోగా, షెడ్డుకు కూడా నష్టం జరిగింది. అయితే, మార్కెట్ ఆస్తులతో పాటు పంటలకు వర్తించేలా మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన రూ.2.50కోట్ల విలువైన బీమా చేయించారు. కొంత కాలంగా మార్కెట్‌లో కొనుగోలు చేసిన 1,809 బస్తాల పత్తిని శ్రీ శివగణేష్ కృష్ణ ట్రేడర్స్ యజమాని చిత్తూరి శ్రీనివాస్ నిల్వ చేయగా అగ్నిప్రమాదంలో 1,519 బస్తాల పత్తి కాలిపోయింది. ఈ షెడ్డు పక్కన మరికొందరు వ్యాపారులు పత్తి, మొక్కజొన్నలు ఉన్నా మంటలు విస్తరించకుండా చర్యలు తీసుకున్న విషయం విదితమే. అయితే, ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ఈ–నామ్ విధానంలో జరుగుతుండడంతో ఎందరు రైతుల వద్ద వ్యాపారులు పత్తి కొనుగోలు చేశారు, చెల్లించిన ధర, నిల్వ చేసిన సరుకు తదితర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. ఈ వివరాల ఆధారంగా మార్కెట్ కమిటీ లెక్కలు సిద్ధం చేయగా, బీమా కంపెనీ ప్రతినిధులు ఇప్పటికే పరిశీలించారు. మరోమారు ఉన్నతాధికారులు పరిశీలించాక నష్టపరిహారంపై తేల్చనున్నట్లు తెలిసింది. కాగా, అగ్ని ప్రమాదంలో సుమారు రూ.47లక్షల మేర నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కాలిపోయిన 1,519 బస్తాల పత్తికి క్వింటా రూ.6,800 చొప్పున రూ.41.31 లక్షలు, మార్కెట్ షెడ్డు విలువ రూ.5 లక్షలు కలిపి నష్టాన్ని గుర్తించారు. ఇప్పటికే పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినందున నివేదిక ఆధారంగా బీమా సొమ్ము అందుతుందని చెబుతున్నారు.

సింగరేణి 'గుర్తింపు' ఎన్నికలపై నేడు సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఏడో పర్యాయం గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై మంగళవారం సమీక్ష జరగనుంది. హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్(సెంట్రల్) కార్యాలయంలో డీవైసీఎల్సీ డి.శ్రీనివాస్ ఎన్నికలాధికారి హోదాలో ఈ సమావేశం ఏర్పాటుచేశారు. సింగరేణి పరిధిలోని 15 కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్యానికి ఇప్పటికే సమాచారం ఇచ్చారు. 2017 అక్టోబర్ 5న జరిగిన ఎన్నికల్లో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఎన్నిక కాగా, కాలపరిమితి పూర్తయి ఏడాది గడిచినా ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఏఐటీయూసీ నాయకులు గత నవంబర్‌లో హైకోర్టును ఆశ్రయించగా, మూడు మాసాల్లో ఎన్నికలు నిర్వహించాలని డిసెంబర్‌లో ఆదేశించింది. ఇదే విషయమై సింగరేణి సీఎండీకి లేఖ పంపిస్తే విద్యుత్ అవసరాల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా మూడు మాసాలు గడువు కోరారు. ఈ గడువు మే 31తో ముగియడంతో ఎన్నికల నిర్వహణపై అధికారులు సమీక్షకు సిద్ధమయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగే సమావేశంలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపితే షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది.

ప్రజాగర్జన స్ఫూర్తితో ఉద్యమిద్దాం..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలోని ప్రజాసమస్యల పరిష్కారం, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ డిమాండ్‌తో కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగర్జన బహిరంగ సభ విజయవంతమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ఈ సభ స్ఫూర్తితో ప్రజల సమస్యల పరిష్కారానికి మరిన్ని ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. కొత్తగూడెంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను రానున్న కాలంలో ఎండగట్టి ఓడించే శక్తి సీపీఐకే ఉందని చెప్పారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధినిచ్చే సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచనను వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నట్లుగా తామూ రోజుకో సమస్యపై ఉద్యమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఇందులో ప్రధానంగా సింగరేణి కార్మికుల సమస్యలతో పాటు విభజన హామీలైన బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐఎం, ఐఐటీ ఏర్పాటు తదితర సమస్యలను ఎంచుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా, నాయకులు బందెల విజేందర్, వంగా వెంకట్, దమ్మాలపాటి శేషయ్య, జి.వీరస్వామి, రమణమూర్తి, నరాటి ప్రసాద్, కె.రత్నకుమారి, వై.శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లు ప్రారంభం

క్వింటాకు రికార్డు స్థాయిలో రూ.25వేల ధర



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న అధికారులు

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి సత్యనారాయణ, ప్రత్యేక కార్యదర్శి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో రైతులు మిర్చి తీసుకురాగా, క్వింటాకు రికార్డు స్థాయిలో రూ.25 వేల ధర పలికింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మధిర మార్కెట్‌లో తేజ రకానికి ఇదే అత్యధిక ధర అని తెలిపారు. రైతులు మార్కెట్‌లోనే పంట అమ్ముకుని మద్దతు పొందాలని కోరారు.

జేవీఆర్ ఓసీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్



ఓసీలో పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీని సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా సీహెచ్‌పీలో బొగ్గు రవాణా, లోడింగ్‌పై ఆయన సూచనలు చేశారు. అంతేకాకుండా బొగ్గు లోడింగ్ సమయాన దుమ్ము, ధూళి లేవకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆతర్వాత ఓసీలో ఓబీ వెలికితీత, బొగ్గు ఉత్పత్తిని పరిశీలించి లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్, అధికారులు జీ.వీ.కోటిరెడ్డి, వై.రఘురామిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, ఎస్.వెంకటాచారి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.